క్లుప్తంగా

మోటాపురంలో విద్యుత్ బిల్లులపై నిరసన

నేలకొండపల్లి: విద్యుత్ సంస్థ వసూలు చేస్తున్న అదనపు బిల్లులపై మండలంలోని మోటాపురం గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం విద్యుత్ సంస్థ అధికారులు ఏసీడీ(అడిషనల్ కంజప్షన్ డిపాజిట్) బిల్లుల వసూలు చేపట్టగా కేంద్రం వద్ద గ్రామస్తులు అదనంగా వసూలు చేయడాన్ని మండిపడ్డారు. విద్యుత్ సిబ్బందిపై వాదనకు దిగారు. కాగా, బాధితుడు గుగులోత్ ఉపేందర్ 243 యూనిట్లు వినియోగించుకున్నందుకు రూ.1,000 బిల్లు వచ్చింది. అయితే అదనపు బిల్లు రూ.1,610, ఇతరత్రా బిల్లులు అంటూ మొత్తం రూ.2,687 చెల్లించాలని బిల్లులు రావటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులంతా బిల్లులు చెల్లించకుండా సిబ్బందితో వాగ్వాదానికి దిగి బిల్లులు చెల్లించకుండా వెనుదిరిగారు.

రైతులపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్న కేంద్రం

నేలకొండపల్లి: రైతులపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ రచ్చా నరసింహారావు ఆరోపించారు. మండలంలోని చెన్నారంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం పెంచిన ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టం కలిగించే విద్యుత్ సరళీకరణ విధానాలను వెంటనే రద్దు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కే.వీ.రెడ్డి, నాయకుడు కట్టేకోల వెంకటేశ్వర్లు, సీటు జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నియామకం..



నియామక పత్రం అందజేస్తున్న లక్కినేని

ఖమ్మంమయూరిసెంటర్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఖమ్మం జిల్లా మహిళ అధికార ప్రతినిధిగా సింగారం యాక లక్ష్మిని నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు నియామక పత్రాన్ని అందజేశారు. మంగళవారం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలస్యం రవి, ఎస్టీ సెల్, యూత్, బీసీ సెల్ అధ్యక్షులు రాంబాబు నాయక్, పి.రాఘవ, చింతల వాసు, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాణోతు వీరు నాయక్, పలు మండల అధ్యక్షులు వాలూరి సత్యనారాయణ, తాళ్లూరి రాంబాబు, పీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి..

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు తిరుమలాయపాలెం సొసైటీ వైస్ చైర్మన్ చామకూరి రాజు తండ్రి చామకూరి వెంకన్న మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పిండిప్రోలు గ్రామానికి వచ్చి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు భాషబోయిన వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి
వినోద	వారసుడు
సాయిరాం	వీరసింహారెడ్డి
ఆదిత్య	వీరసింహారెడ్డి
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	వాల్తేరు వీరయ్య

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	22	బచ్చలికూర	2
వంకాయ	66		10
బెండకాయ	66	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	56	చుక్కకూర	2
బోడ కాకర	80		10
బీర	56	తోటకూర	2
దొండ	56		10
పొట్లకాయ	66	గోంగూర	2
చిక్కుడు	86		10
గోరుచిక్కుడు	56	మెంతికూర	5
క్యాబేజీ	16		20
క్యాలీఫ్లవర్	20	కొత్తిమీర	1
ఆలుగడ్డ	30		30
చామగడ్డ	64	పుదీన	1
క్యారెట్	30		20
క్యాప్సికం	50	-ఖమ్మం వ్యవసాయం	

అంతా గులాబీమయం..

- నేడు బీఆర్‌ఎస్ బహిరంగ సభ
- ఖమ్మం గుమ్మంకు భారీ జన సమీకరణ



పైనంపల్లిలో జన సమీకరణ సమావేశంలో మాట్లాడుతున్న డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీనివాసరావు



నేలకొండపల్లిలో ముస్తాబైన ప్రధాన సెంటర్

నేలకొండపల్లి: ఖమ్మంలో నేడు జరగనున్న బీఆర్‌ఎస్ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు భారీగా జన సమీకరణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పాలేరు నుంచి దాదాపుగా 50 వేల నుంచి 70 వేల మందిని తరలించేందుకు నాయకత్వం శ్రీకారం చుట్టింది. దీని కోసం కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాలకు ప్రత్యేక నాయకులను నియమించడంతో పాటు మండల కేంద్రాల్లో తోరణాలు, ఫ్లెక్సీలు, కటౌట్‌లు భారీ ఎత్తున ఏర్పాటు చేశారు. బహిరంగ సభకు ముగ్గురు ముఖ్యమంత్రులు రావటంతో బీఆర్‌ఎస్ బలనిరూపణకు సిద్ధమైంది.

సవాల్‌గా తీసుకొని..

ఇటీవల ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ.. పాలేరు సత్తాను చాటాలని పిలుపు ఇవ్వటంతో నాయకులు సవాల్‌గా తీసుకుని గ్రామాల వారీగా కమిటీ సమావేశాలను ఏర్పాటు చేసి జనసమీకరణ గురించి చర్చించారు. ప్రతీ గ్రామానికి అవసరమైన వాహనాలను ఏర్పాటు చేసుకుని మరీ పార్టీ నాయకులంతా ఎవరికి వారే బలం నిరూపించుకునేందుకు జనసమీకరణపై దృష్టి సారించారు. పార్కింగ్ స్థలాలు, ప్రజలు వచ్చి, పోయే వరకు గ్రామాల వారీగా ఇన్‌చార్జ్‌లను ఏర్పాటు చేశారు. మొత్తం మీద పాలేరును గులాబీమయంగా మార్చేశారు. సభ విజయవంతం చేసేందుకు పార్టీ అనుబంధ సంఘాల నాయకులకు బాధ్యతలు అప్పగించారు. ఖమ్మంకు సమీపంలో ఉండటంతో పాలేరు నుంచి ప్రజలు ఎక్కువ మందిని తరలించే ఏర్పాట్లు విస్తృతంగా చేపట్టారు.

'వర్సిటీ' ఏర్పాటు ప్రకటన చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆజాద్

ఖమ్మంమయూరిసెంటర్: ఏళ్ల తరబడి ఖమ్మం జిల్లా ప్రజలు, విద్యార్థుల ఆకాంక్ష అయిన యూనివర్సిటీ ఏర్పాటుపై ముఖ్యమంత్రి కేసీఆర్ 18న జరిగే బహిరంగ సభలో ప్రకటన చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామల ఆజాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి దేశ దిక్సూచిగా చెబుతున్న కేసీఆర్ విద్యారంగ అభివృద్ధిపైన, ఖమ్మం జిల్లా యూనివర్సిటీ ఏర్పాటుపైన కార్యాచరణ ప్రకటన చేయాలన్నారు. అంతేకాక రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై ఆదేశాలు జారీ చేయాలని తెలిపారు. ఖమ్మం కేంద్రంగా సంక్షేమ వసతి గృహ విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం కోసం ఖమ్మం బహిరంగ సభ కేంద్రం అయ్యే విధంగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రతి మండలానికి జూనియర్ కళాశాల, నియోజకవర్గానికి ఒక పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టో జిల్లాలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా సహాయ కార్యదర్శి దీపిక, ఖమ్మం డివిజన్ కార్యదర్శి లక్ష్మణ్, నగర కార్యదర్శి కరుణ్, నాయకులు శ్రీకాంత్, పృథ్వీ, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయానికి మంత్రి, ఎమ్మెల్సీ



సమావేశమైన మంత్రి కొప్పుల ఈశ్వర్, తదితరులు

కూసుమంచి: ఖమ్మంలో బుధవారం జరిగే బీఆర్‌ఎస్ బహిరంగ సభలో పాల్గొనేందుకు విచ్చేసిన మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రావు కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొద్దిసేపు ఆగారు. వారికి ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తేనేటి విందును స్వీకరించారు. బీఆర్‌ఎస్ సభ, జన సమీకరణ తదితర అంశాలపై వారు చర్చించారు.

దళితులపై దాడులు చేస్తే ఉపేక్షించం



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: నిజామాబాద్ జిల్లా కోటగిరిలో దళిత టీచర్ మల్లికార్జున్‌పై బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ దుండగులు చేసిన దాడిని ఖండించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఖమ్మం ధర్నాచౌక్‌లో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వై.విక్రమ్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్ర శ్రీకాంత్ పాల్గొని మాట్లాడారు. దేశంలో జరిగిన విధంగా రాష్ట్రంలోనూ దళితులు, మైనార్టీ వర్గాల మీద దాడులకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని, భవిష్యత్తులో ఇలాంటి దాడులు చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. మోదీ ప్రభుత్వం కార్మిక వర్గం మీద దాడులను ప్రోత్సహిస్తూ వారి ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను ప్రజలకు, కార్మికులకు అంట కట్టే విధంగా ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్‌పరం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పేరంపల్లి మోహన్‌రావు, బండారు యాకయ్య, జిల్లా సహాయ కార్యదర్శి జిల్లా ఉపేందర్, భూక్య శీను, మాచర్ల గోపాల్, త్రీ టౌన్ కన్వీనర్ ఎర్ర మల్లికార్జున్, టూ టౌన్ కన్వీనర్ కాంపాటి వెంకన్న, జిల్లా నాయకులు దొంగల తిరుపతిరావు, పవన్, మురళి, నర్రా రమేష్, శెట్టి రవీందర్, లింగయ్య, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

'వెలమ'లకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలి



మంత్రి హరీశ్‌రావును కలసిన వెలమ సంఘం నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం: వెలమలకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని వెలమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాగి వెంకటేశ్వరావు కోరారు. ఈ మేరకు ఆర్థిక, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావుతో పాటు ఎంపీ వద్దిరాజు రవిచంద్రను కలిసి విన్నవించారు. కమ్యూనిటీ హాల్ స్థలంలో నిర్మాణం చేయటానికి సహకరించాలని కోరారు. ఆయన వెంట ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్, రిటైర్డు తహసీల్దార్ ఆర్.రవీంద్రరావు, రిటైర్డు ఉద్యోగులు ప్రభాకర్‌రావు, హన్మంతరావు, సుధాకర్‌రావు, వెంకటేశ్వరావు, కె.రామ్మోహన్‌రావు, అరుణకర్‌రావు, ప్రగతి విద్యా సంస్థల అధినేత సురేష్, స్థానిక వ్యాపారులు సత్యనారాయణరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



కట్టుకాసారాంలో వరి సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ విజయచంద్ర

నేలకొండపల్లి: వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కూసుమంచి ఏడీఏ ఎస్.విజయచంద్ర సూచించారు. మండలంలోని బోదులబండ, కట్టుకాసారం గ్రామాల్లో మంగళవారం పంటల వివరాల నమోదును పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వే నంబర్ల వారీగా రైతుబంధు పోర్టల్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. వరి నాటు దశలో ఉన్నందున జింకు లోప లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించి తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. మండల వ్యవసాధికారి నారాయణరావు, ఏఈఓలు అరవింద్, అవినాష్, రైతులు అచ్చయ్య, లక్ష్మీనారాయణ, ధర్మారావు, గోపాల స్వామి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


'కంటి వెలుగు' ఆహ్వానం ఇంటింటికీ అందాలి



కొత్తకొత్తూరులో ఆహ్వాన పత్రిక విడుదల చేస్తున్న సర్పంచ్ రాధాకృష్ణ

నేలకొండపల్లి: నేటి నుంచి ప్రారంభమయ్యే కంటి వెలుగు కార్యక్రమ ఆహ్వాన పత్రికలను ప్రతీ ఇంటికి చేరేలా చూడాలని కొత్తకొత్తూరు సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ సూచించారు. మంగళవారం మండలంలోని కొత్తకొత్తూరులో కంటి వెలుగు ఆహ్వాన పత్రికలను పంపిణీ చేశాక ఆయన మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమం ఆదర్శంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని పంచాయతీ సిబ్బంది, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాగర్తి సుధాకర్, వైద్యులు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వాలీబాల్ విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతి అందిస్తున్న రమేష్, తదితరులు

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడి గ్రామంలో గత ఎనిమిదేళ్లుగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ చిమ్మపుడి గ్రామ కమిటీల ఆధ్వర్యంలో మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. అయితే మంగళవారం బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమానికి డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతల రమేష్ పాల్గొని బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ మేనేజ్‌మెంట్ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ గ్రామ, మండల నాయకులు జోనెబోయిన నవీన్, దశరథ వీరబాబు, దొంతు గణేష్, రేమల్లే జైపాల్, రాచర్ల నరేష్, దశరథ వినోద్, సురేష్, కుదురుపాక సాయి, పావురాల పవన్, షేక్.సమీర్, జోనెబోయిన వెంకటేష్, లత పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని నిరసన



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బహుజన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: దళిత న్యాయవాద దంపతులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ బహుజన(జేఏసీ) ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ, మున్సిపల్, అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపి, వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు మాట్లాడుతూ.. న్యాయవాద దంపతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ పాలవ్వంచ రామారావు, వివిధ కుల సంఘాల నాయకులు గుంతేటి వీరభద్రం, పద్మాచారి, పెరు గు వెంకటరమణ, భద్రూనాయక్, సంజీవరావు, రహమాన్, సుధాకర్, ఎస్‌కె. నజీమా, ఉపేంద్రనాయక్, శ్రీనివాస్, రమ్య, జమీల్, నాగేశ్వరావు, సతీస్, బండి రవి తదితరులు పాల్గొన్నారు.

నాడు పంట భూములు.. నేడు కలెక్టరేట్

కలెక్టరేట్, బహిరంగ సభతో వీ.వీ.పాలెంకు గుర్తింపు



2017లో భూమిని పరిశీలిస్తున్న వాస్తుశిల్పి తేజ, అధికారులు(ఫైల్)



కలెక్టరేట్ నిర్మాణ ప్రాంతంలో సాగైన పత్తి చేను (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ఒకప్పుడు పంటల సాగుతో పచ్చదనం పరుచుకున్న భూమి అది.. అధికారుల చర్చలతో రైతులు భూములు ఇవ్వగా నేడు ఆ స్థానంలో జిల్లా కలెక్టరేట్ నిర్మాణం పూర్తికావడం ద్వారా మండలంలోని వీ.వీ.పాలెంకు ప్రత్యేక గుర్తింపు లభించింది. దీనికి తోడు కలెక్టరేట్ వెనుకాల బీఆర్‌ఎస్ బహిరంగ సభ నిర్వహిస్తుండడంతో గ్రామం పేరు జాతీయ స్థాయిలో మార్మోగుతోంది. ఖమ్మం జిల్లాకు అప్పటికే కలెక్టరేట్ ఉన్నప్పటికీ అన్ని శాఖలు ఒకేచోట కొలువుదీరేలా నూతన కలెక్టరేట్ నిర్మాణానికి సిద్ధమయ్యారు. అయితే, నగరంలో సరిపడా ప్రభుత్వ భూమి లేకపోగా, ప్రధాన రోడ్డుకు ఆనుకుని అందరికీ అందుబాటులో ఉండాలనే భావనతో వీ.వీ.పాలెంలో భూసేకరణకు నిర్ణయించారు. ఈక్రమంలో సీఎం మెచ్చిన వాస్తు శిల్పి తేజ పరిశీలించాక భూమి సేకరణ కోసం అధికారులు రంగంలోకి దిగారు. తొలుత రైతులు సేమిరా అన్నప్పటికీ అప్పటి కలెక్టర్ లోకేష్‌కుమార్, జేసీ వినయ్‌కృష్ణారెడ్డి, ఆర్డీఓ పూర్ణచంద్రరావు, తహసీల్దార్ తిరుమలాచారి పలుదఫాలు చర్చలు జరిపి ఎకరానికి రూ.కోటి పరిహారం చెల్లించేలా ఒప్పించి భూములు సేకరించారు. అలా ప్రారంభమైన కలెక్టరేట్ నిర్మాణం పూర్తి కావడం, ఇప్పుడు బహిరంగ సభ కూడా ఇక్కడే జరుగుతుండడంతో గ్రామానికి ప్రత్యేక గుర్తింపు లభించింది.



భూసేకరణకు రైతులతో చర్చిస్తున్న జేసీ వినయ్‌కృష్ణారెడ్డి (ఫైల్)



కలెక్టరేట్ నిర్మాణ పనులు మొదలైనప్పటి దృశ్యం

పార్కింగ్ కోసం ఫ్లెక్సీల ఏర్పాటు



ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న పోలీసులు

తిరుమలాయపాలెం: ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ సభకు భారీగా జనం తరలివచ్చే అవకాశాలు ఉండడంతో పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. మరిపెడ నుంచి తిరుమలాయపాలెం మండలం వరకు మీటింగ్‌కు తరలే వాహనాలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రైవేట్ వాహనాలను దారి మళ్లించేందుకు పలు ప్రాంతాలలో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలివస్తున్న నేపథ్యంలో మంగళవారం ట్రాఫిక్ నిబంధలపై ఏఎస్సై రాఘవయ్య పోలీస్ సిబ్బంది కలిసి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

గ్రామాల్లో.. ప్రచారం ముమ్మరం



అమ్మగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్

కూసుమంచి/నేలకొండపల్లి: సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఖమ్మంలో నేడు నిర్వహించే బీఆర్‌ఎస్ భారీ తొలి బహిరంగసభకు పాలేరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు తరలి రావాలని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశ చరిత్రను మార్చే రోజుగా ఈ సభ జరగబోతోందని, ఈ సభతో ఖమ్మం జిల్లా చరిత్ర సృష్టిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతేకాక నేలకొండపల్లి సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గండు సతీష్ నేలకొండపల్లి మండలంలోని అమ్మగూడెంలో మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. మండలం నుంచి దాదాపు 10వేల మంది తరలించే విధంగా కార్యచరణను రూపొందించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బీజేపీ నేతలు



పోలీసుల అదుపులో గల్లా సత్యనారాయణ

ఖమ్మంమామిళ్లగూడెం: బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభను పురస్కరించుకుని పోలీసులు మంగళవారం రాత్రి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణను ఆ పార్టీ కార్యాలయంలో అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు బీజేపీ ప్రధాన కార్యదర్శులు శ్యాంరాథోడ్, నున్నా రవికుమార్, జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్‌లను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

తిరుమలాయపాలెం: ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ బహిరంగ సభ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) నాయకులను ముందస్తు అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని బచ్చోడు గ్రామంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దగహం చేసి నిరసన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. కనీసం ప్రజా సమస్యలు చెప్పేందుకు కూడా అవకాశాలు కల్పించకుండా నిరంకుశ విధానాలు అవలంభిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, నగేష్, నందిపాటి ఉపేందర్, శ్రీరాములు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

29 ఏళ్ల నాటి మధుర జ్ఞాపకాలు..



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి(1989 నుంచి 1994 బ్యాచ్) వరకు చదువుకున్న పూర్వవిద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 29 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ పలకరింపుతో కార్యక్రమాన్ని ప్రారంభించి నాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఆట, పాటలతో సందడి చేయడంతో పాటు మృతి చెందిన తోటి స్నేహితులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గురువు దేవరపల్లి వెంకటరెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు డాక్టర్ అనంతు హరిష్, కె.ముత్తయ్య, కాసాని పుల్లయ్య, తెలగమళ్ల వెంకన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.